క్లుప్తంగా

మృతదేహం తెప్పించాలని వినతి



పెర్కిట్(ఆర్మూర్): ఇటీవల సౌదీ అరేబియా దేశం రియాజ్‌లో ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన గాంధారి మండలానికి చెందిన చాకలి పోశయ్య(48) మృతదేహాన్ని త్వరగా ఇండియాకు తెప్పించాలని కుటుంబ సభ్యులు శుక్రవారం మామిడిపల్లిలో ప్రవాస భారతీయుల హక్కులు, సంక్షేమ వేదిక వ్యవస్థాపకుడు కోటపాటి నర్సింహ నాయుడిని కోరారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రం అందజేశారు. త్వరగా రప్పించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఆర్థిక సాయం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన గద్దల సంతోష్(32) రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి శుక్రవారం ముప్కాల్ మండల జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ- నర్సారెడ్డిలు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రూ.5 వేలు అందించారు.

ముగిసిన లక్‌పతి దీదీ శిక్షణ



బాల్కొండ: స్థానిక ఐకేపీ కార్యాలయంలో రెండు రోజులుగా వీవోలకు అందిస్తున్న లక్‌పతి దీదీ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. మహిళలకు ఏడాదికి లక్ష రూపాయల ఆదాయం కల్పించడమే లక్‌పతి దీదీ లక్ష్యమని డీపీఎం మారుతి అన్నారు. ప్రతి నెల రూ.10 వేల ఆదాయం వచ్చేలా రుణాలు, జీవనోపాధి పనులను గురించి వివరించారు. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా ఎలా ఆదాయం సమకూర్చుకోవచ్చో వివరించారు. ఏపీఎంలు ప్రసాద్‌రావు, రవి పాల్గొన్నారు.

ఇంగ్లిష్ లర్నింగ్ తరగతుల పరిశీలన




పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో కాకతీయ స్యాండ్‌బాక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంగ్లిష్ లర్నింగ్ తరగతులను వ్యవస్థాపకుడు రాజీవ్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి, విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాజీవ్ రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ క్లాంం మోహన్ రెడ్డి, ఐడీహెచ్ మధు, ఎస్‌ఎంసీ చైర్మన్ గంగా రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజేష్, ఉపాధ్యాయులు అశ్పాక్ అహ్మద్, శౌరి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోదీ దిష్టిబొమ్మ దహనం



కమ్మర్‌పల్లి: హర్యానా రాష్ట్రంలో పోలీస్ కాల్పుల్లో మృతి చెందిన రైతు ఘటనను నిరసిస్తూ శుక్రవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని కాపాడాలి- మోదీని తొలగించాలి అనే నినాదంతో చలో ఢిల్లీ వెళ్తు న్న హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కాల్పులు జరిపాయని ఆరోపించారు. నాయకులు సారా సురేష్, అశోక్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



వర్ని(చందూర్): తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్(ట్రస్మా) నూతన కార్యవర్గాన్ని గురువారం చందూర్‌లో ఎన్నుకున్నారు. జిల్లా జనరల్ బాడీ సమావేశంలో జిల్లా నూతన అధ్యక్షుడిగా రాస నిత్యానందం (మాక్లూర్), ప్రధాన కార్యదర్శిగా అరుణ్ కుమార్(నందిపేట), కోశాధికారిగా ఉప్పాల మధు(చందూర్), సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు.

పన్ను వసూళ్లకు ప్రణాళికలు

- ప్రత్యేక బృందాల ఏర్పాటు
- ఇప్పటికే 42 శాతం వసూలు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపాలిటీలో 2023–24 ఆర్థిక సంవత్సరం పన్ను వసూళ్లకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఆస్తి పన్ను వసూలు కోసం ఐదుగురు బిల్ కలెక్టర్‌లతో పాటు 5 టీంలు తయారు చేసి టీంకు ముగ్గురు చొప్పున బల్దియా సిబ్బందిని కేటాయించి ఆర్థిక సంవత్సరం ముగింపు రోజు నాటికి 100 శాతం వసూలుకు ముందుకు సాగుతున్నారు. బోధన్ బల్దియా పరిధిలో 38 వార్డులు, 17,500 ఇళ్లు, వెయ్యికిపైగా వ్యాపార సముదాయాలు ఉన్నాయి. లక్షకు పైగా జనాభా ఉంది. రోజురోజుకు పట్టణ విస్తీర్ణం పెరుగుతుండడంతో నూతనంగా నిర్మాణాలు పెరుగుతున్నాయి. దీంతో బల్దియాకు ప్రతి యేటా రావాల్సిన ఆస్తి పన్ను సైతం పెరుగుతూ వస్తుంది. 2023–24 ఆర్థిక సంవత్సరం బల్దియా ఆస్తి పన్ను రూ.6 కోట్ల84 లక్షల 51 వేలు రావాల్సి ఉంది. ఈ పన్ను వసూలును జనవరి, గత యేడాది అక్టోబర్ నెల నుంచి వసూలు చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి వస్తుండడంతో బల్దియా అధికారులు ఆస్తి పన్ను వసూలును వేగవంతం చేశారు.

మిగిలింది 35 రోజులే ...

2023–24 ఆర్థిక సంవత్సరానికి నిర్ధారించిన ఆస్తి పన్ను 100 శాతం వసూలు చేయడానికి ఇంకా 35 రోజులు మాత్రమే మిగిలింది. ఇప్పటికీ బల్దియా అధికారులు 48 శాతం పన్ను వసూలు చేయగా ఇంకా 52 శాతం వసూలు చేయాల్సి ఉంది.

ఐదు బృందాలు..

ఆస్తి పన్ను వసూలే లక్ష్యంగా బల్దియా అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. దీని కోసం బిల్ కలెక్టర్‌లతో టీంకు ముగ్గురు బల్దియా సిబ్బందిని ఏర్పాటు చేసి టీంకు ఏరియాను బట్టి రోజుకు రూ. లక్షా 20 వేల నుంచి రూ. 60 వేల వరకు టార్గెట్‌ను విధించి వసూళ్లకు పంపుతున్నారు. ఇదే కాకుండా వాహనాన్ని ఏర్పాటు చేసి వార్డుల్లో బల్దియా అభివృద్ధికి సహకరించాలని ప్రచారం చేస్తున్నారు. దీంతో పాటు ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఫోన్ చేసి పన్ను సకాలంలో చెల్లించి సహకరించాలని మహిళా సిబ్బందితో ఫోన్ చేయిస్తున్నారు.

సకాలంలో చెల్లించాలి



బల్దియా పరిధిలో పారిశుధ్య నిర్వహణతో పాటు కార్మికుల వేతనాలు చెల్లించడం, ఇతర పట్టణ అభివృద్ధి పనులు జరగాలంటే ఆస్తి పన్నును పట్టణ ప్రజలు సకాలంలో చెల్లించాలి. ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి 100 శాతం పన్ను వసూలు చేస్తాం.

– వెంకట నారాయణ, మున్సిపల్ కమిషనర్

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఈవో దుర్గా ప్రసాద్

పెర్కిట్(ఆర్మూర్): పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈవో దుర్గా ప్రసాద్ సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం డివిజనల్‌లో ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. సీ గ్రేడు విద్యార్థులను ఏ గ్రేడు విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్నారు. అలాగే లైబ్రరీ పిరియడ్‌లో కథల పుస్తకాలు చదివించాలన్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి ప్రి ఫైనల్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అలాగే కార్మికుల పిల్లలను గుర్తించి వారిని పని ప్రాంత పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. జీసీడీవో వనిత, ఎంఈవోలు రాజ గంగారం, శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌వీఎం సెక్టోరియల్ అధికారులు శ్రీనివాస్, శ్రీధర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్స్ ప్రవీణ్ కుమార్, రాజేశ్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్

- కోటగిరి ఎంపీపీ, ఇద్దరు ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఏనుగు రవీందర్ రెడ్డి

రుద్రూర్: కోటగిరి ఉమ్మడి మండలంలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కోటగిరి మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ సునీతతో పాటు దోమలేడ్గి, పోతంగల్ ఎంపీటీసీలు అనంత విఠల్, కేశ వీరేశం, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హస్తం గూటికి చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్, రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్ రావ్, నేమాని వీర్రాజు, బర్ల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సీటు గెలుపే లక్ష్యంగా పని చేయాలి

జహీరాబాద్ ఎంపీ సీటు గెలుపే లక్ష్యంగా పని చేయాలని బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. కోటగిరిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కొత్త, పాత అని తారతమ్య బేధాలు లేకుండా ప్రజాసేవ చేసే వారికి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. అందరు కలిసి పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



మాక్లూర్: అడవి మామిడిపల్లి శివారులో ఉన్న అపు రూప వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం ధ్వజారోహణం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కు మార స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జానపద నృత్యాలు అలరించాయి. ఆలయ ట్రస్ట్ చైర్‌పర్సన్ అమృతలత హాజరయ్యారు.

బంగారు వెంకన్న కల్యాణోత్సవం



బాల్కొండ: వెంచిర్యాల్‌లో శుక్రవారం బంగారు వేంకటేశ్వరుని కల్యాణోత్సవం వైభవంగా జరిపించారు. ముందుగా గ్రామంలో ఎదుర్కొళ్లు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల్కొండ మండల కేంద్రంలో మల్లన్న ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గ్రామం నుంచి సీడే(రథం) మల్లన్న గుట్టకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ముప్కాల్ మండల కేంద్రంలో శివ శ్రీనివాసుని ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

నేడు మల్లికార్జున స్వామి కల్యాణం

మెండోరా మండలం దూదిగాంలో మల్లికార్జున స్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించటానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలోతరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మల్లన్న జాతరకు సిద్ధం



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలో శనివారం నిర్వహించనున్న ముజిగె మల్లన్న జాతరకు వీడీసీ సభ్యులు సిద్ధం చేస్తున్నారు. జాతర సందర్భంగా ఆలయం చుట్టూ రథోత్సవం నిర్వహిస్తారు. కాగా రథానికి బంతి పూలతో తయారు చేసిన తొట్లెలతో అలంకరిస్తారు. గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ మహిళలు బంతి పూలతో తొట్లెలు తయారు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

మంచి నీటి సమస్య పరిష్కరించాలి



ఆర్మూర్‌టౌన్: యానంగుట్ట సుందరయ్య కాలనీలో రెండు చేతి పంపులు చెడిపోవడంతో మంచినీటి సమస్య తలెత్తితందని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కుతాడి ఎల్లయ్య అన్నారు. సమస్యలు పరిష్కరించాలని సీపీఎం పార్టీ ఆర్మూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల నుంచి మంచి నీటి ట్యాంకర్లు సైతం రావడం లేదన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జవహర్‌సింగ్, సాయిలు, ఓంకార్, రఫీ, షాయాదాబేగం, రజియాచాంద్ తదితరులు పాల్గొన్నారు.

స్వాగత తోరణం ప్రారంభోత్సవం



ప్రారంభిస్తున్న సర్వసమాజ్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మి మందిర స్వాగత తోరణాన్ని సర్వసమాజ్ ప్రజా ఐక్య సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల సర్వసమాజ్ సభ్యులు నూతనంగా స్వాగత తోరణాన్ని నిర్మించారు. కాగ సభ్యులు పురోహితుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. సర్వసమాజ్ అధ్యక్షు డు ఆకుల రాజు, వివిధ కులాల సర్వసమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే నర్సింగ్ స్టాఫ్ నియామకం



ఆర్మూర్: ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి చొరవతోనే ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రిలో నర్సింగ్ స్టాఫ్ నియామకమైనట్లు బీజేపీ నాయకులు కలిగోట గంగాధర్ పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలో శుక్ర వారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అక్కడున్న ఇబ్బందులను డాక్టర్లు, రోగుల ద్వారా తెలుసుకొని సంబంధిత మంత్రికి సమస్యలను విన్నవించారన్నారు. అసెంబ్లీలో సైతం సమస్యను లేవనెత్తడం కారణంగానే ఈ నియామకపు ప్రక్రియ వేగవంతంగా ముగిసిందన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

రుద్రూర్: పోతంగల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకున్న వారికి బిల్లులు అందజేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలో పలువురు పూర్తి స్థాయిలో ఇళ్లు నిర్మించుకున్నారని.. బిల్లులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, త్వరగా వచ్చే ఏ ర్పాటు చేయాలని కోరారు. బీజేపీ నాయకులు భజరంగ్, మక్కయ్య, కిరణ్, శంకర్ పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



నందిపేట్ (ఆర్మూర్): తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ శాంతియుతంగా చేపడుతున్న రైతులపై చేసిన దాడులను ఖండిస్తూ శుక్రవారం నందిపేట మండల కేంద్రంలో ఏఐకేఎంఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఢిల్లీలో ధర్నా చేస్తున్న రైతులపై పోలీసులు భాష్ప వాయువులు ప్రయోగించి లాఠీచార్జి చేపట్టడం అమానుషమని అన్నారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కే గంగాధర్, రాజలింగం, బైన చిన్న మల్లయ్య, వంజరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గిర్దావర్ బదిలీ

నవీపేట: నవీపేట గిర్దావర్‌గా విధులు నిర్వహించిన మోహన్ ఇందల్వాయికి బదిలీపై వెళ్లినట్లు తహసీల్దార్ నారాయణ శుక్రవారం తెలిపారు. నవీపేట గిర్దావర్‌గా ఇందల్వాయి నుంచి నరేష్ బదిలీపై వస్తున్నట్లు వెల్లడించారు.

కనుల పండువగా పల్లకీ సేవ



ఉత్సవ విగ్రహంతో పల్లకీ సేవ నిర్వహిస్తున్న గ్రామస్తులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మంథనిలో శుక్రవారం రంగ నాయక స్వామి పల్లకి సేవను కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలో శనివారం వీడీసీ ఆధ్వర్యంలో శ్రీ రంగనాయక స్వామి జాతర నిర్వహించనున్నారు. జాతర సందర్భంగా శుక్రవారం స్వామి వారికి పల్లకి సేవ చేశారు. ఈ సందర్భంగా హరి నామస్మరణతో గ్రామం మారు మ్రోగిపోయింది.

ఉనికిని చాటుకోవడానికే విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

పెర్కిట్(ఆర్మూర్): బీఆర్‌ఎస్ పార్టీతో బీజేపీ పొత్తు అసంభవమని, ఉనికిని చాటుకోవడానికి మాత్రమే ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మామిడిపల్లిలో శుక్రవారం కొమురం భీం క్లస్టర్ విజయ సంకల్ప యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిగా చేయడమే లక్ష్యంగా దేశ ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు. భారత దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లో సైతం మోదీ ప్రభంజనం వీస్తోందన్నారు. అలాగే గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చానన్నారు. పసుపు బోర్డు తీసుకు రావడమే కాకుండా క్వింటాలు పసుపునకు రూ.20 వేల ధర వచ్చేలా చేయడమే తన లక్ష్యమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, పార్లమెంట్ ప్రభారి వెంకటరమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహా రెడ్డి, ఆర్మూర్ ప్రభారి నంద కుమార్, నేతలు పుప్పాల శివరాజ్, ద్యాగ ఉదయ్, కంచెట్టి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో పట్టు సాధించాలి

- ఆశ వర్కర్లు, అంగన్‌వాడీల సేవలు అభినందనీయం
- ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ

బోధన్‌రూరల్(బోధన్): మహిళలు అన్ని రంగాల్లో పట్టు సాధించాలని ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ అన్నారు. శుక్రవారం అమ్దాపూర్‌లో మహిళ, శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్యశాఖల ఆధ్వర్యంలో బేటి బచావో- బేటి పడావోపై అవగాహన కల్పించి, రీఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యతోనే మహిళల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. మహిళలు క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. ఆశవర్కర్లు, అంగన్‌వాడీ సేవలు అభినందనీయమని కరోనా వైరస్ విజృంభన సమయంలో వారి సేవలు ఎప్పటికి మరిచిపోలేమన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో సూపర్‌వైజర్ జానకి, కో- ఆర్డినేటర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపన్యాస పోటీలు



మాక్లూర్: ఈ నెల 28న జరుగనున్న సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మాణిక్‌భండార్ ప్రభుత్వ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కె.నర్సింలు ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు నర్రా రామారావు హాజరై పోటీలు నిర్వహించారు. బ్రిలియంట్ ఉన్నత పాఠశాలకు చెందిన జి మనోజ్ఞ ప్రథమ, మదన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన డి హర్షిత ద్వితీయ, మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు చెందిన ఆర్ వర్ష తృతీయ స్థానంలో నిలిచారు. నర్రా రామారావు, బహుమతులను అందజేశారు. జేవీవీ మండల అధ్యక్షుడు బి ప్రమోద్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెంజల్(బోధన్): ఎడపల్లి సబ్ డివిజన్ పరిధిలోని ఎడపల్లి, రెంజల్, బోధన్ మండలాల్లో శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్ ఏడీఈ లక్ష్మణ్‌నాయక్, రెంజల్ ఏఈ రాజలింగం తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలో నెలవారి మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెంజల్ మండలంలోని దండిగుట్ట, నీలా, తాడ్‌బిలోలి, ఎడపల్లి మండలంలోని ఏఆర్‌పీ క్యాంప్, మంగల్‌పాడ్, ఠాణాకలాన్, బోధన్ మండలంలోని పెగడాపల్లి, కల్దుర్కి, మావంది, ఎరాజ్‌పల్లి, ఊట్‌పల్లి, సంగెం పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నందిపేటలో..

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నందిపేట్, మాక్లూర్ మండల విద్యుత్ వినియోగదారులకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ ఎం అశోక్ తెలిపారు. సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 వరకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రథోత్సవం

ఎడపల్లి(బోధన్): జానకంపేట లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం యజ్ఞం, బలిహరణం, హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. శనివారం సాయంత్రం 4 గంటలకు శ్రీస్వామివారి రథోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, భజన పోటీలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సభా స్థలాన్ని పరిశీలించిన రైల్వే అధికారులు



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని గాంధీ పార్కు రైల్వే గేట్ వద్ద నిర్మించనున్న రైల్వే బ్రిడ్జి నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ నెల 26న జరుగనుంది. సభ నిర్వహించే స్థలాన్ని రైల్వే అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ ప్రారంభోత్సవానికి ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ఏర్పాట్లలో భాగంగా గాంధీ పార్కు రైల్వే స్టేషన్‌ను శుభ్రం చేయించామన్నారు. ఈ రైల్వే బ్రిడ్జి పనుల ప్రారంభోత్సవాన్ని ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – క్రాక్-జీతేగా తో జీయేగా (హిందీ) - 10.10, 3.40, 9.45
తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి (తెలుగు) - 1.30
సుందరం మాస్టర్ (తెలుగు) - 7.01

స్క్రీన్-2 – భ్రమ యుగం (తెలుగు) - 12.00, 9.10 సిద్ధార్థరాయ్ (తెలుగు)-3.00
ఊరు పేరు భైరవ కోన(తెలుగు) - 6.10

స్క్రీన్-3 – ఆర్టికల్-370 (హిందీ) - 1.00, 7.10, 10.35
సుందరం మాస్టర్ (తెలుగు) - 4.25

స్క్రీన్-4 – ముఖ్యగమనిక (తెలుగు) - 1.05
మన్సు పేడ్స్ ఉన్నాయ్ రా - 1.50,
హనుమాన్ (తెలుగు)-06.50
సుందరం మాస్టర్ (తెలుగు) - 10.10